క్లుప్తంగా

కేన్సర్‌పై అవగాహన సదస్సు



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్లు

కావలి: ప్రపంచ కేన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని కావలి ఐఎంఏ, ఉమెన్ డాక్టర్స్ వింగ్, పింక్ హెల్త్ మిషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ బీసీ కళాశాల బాలికల వసతిగృహంలో విద్యార్థినులకు అవగాహన నిర్వహించారు. ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ కారుమంచి సుబ్బారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డాక్టర్ బెజవాడ రవికుమార్ మాట్లాడారు. కేన్సర్‌పై అవగాహన తగు సూచనలు, పలు జాగ్రత్తలు తెలియజేశారు. హాస్టల్ విద్యార్థినులకు డాక్టర్ గోపి కుటుంబ ఆర్థిక సహకారంతో 200 దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు డాక్టర్లు, సిబ్బంది, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై ఇంద్రసేనారెడ్డి

ఉదయగిరి: త్వరలో ఎన్నికలు జరగనున్న దృష్ట్యా గ్రామాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై కర్నాటి ఇంద్రసేనారెడ్డి సూచించారు. ఆయన ఆదివారం మండలంలోని జి.చెరువుపల్లిలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు రాజకీయ కక్షలకు దూరంగా ఉంటూ ఒకరికొకరు స్నేహభావంతో మెలగాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు. మద్యం విక్రయాలు చేపట్టరాదని, వివాదాలకు పాల్పడినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో కొత్త వ్యక్తులు సంచరిస్తున్నట్లు తెలిస్తే తమకు సమాచారం అందించాలన్నారు.

ఘనంగా గంధమహోత్సవం



సమాధికి గంధం పూస్తున్న మత పెద్దలు

మర్రిపాడు: మండలంలోని నందవరంలో కొలువైన హజరత్ సయ్యద్ నజ్ ఏ ఆలం షాహిద్ 233వ గంధమహోత్సవం శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజామున గంధాన్ని గురువులు సయ్యద్ అజీజుల్లాషా ఒకటో కమారుడు సయ్యద్ కరిముల్లా గృహం నుంచి ఫకీర్ల మేళతాళాల నడుమ గ్రామ పురవీధుల్లో ఊరేగింపుగా తిరిగి దర్గా వద్దకు చేర్చారు. సమాధిపై గలేపులు, పూల దుప్పట్లు కప్పి, సుగంధ ద్రవ్యాలు సమర్పించారు. దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి గంధ ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేశారు. దర్గా ఆధ్వర్యంలో శనివారం రాత్రి భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఫుట్‌బాల్ క్రీడాకారుడి జన్మదిన వేడుకలు



ఫుట్‌బాల్ క్రీడాకారుడు క్రిస్టియానో రోనాల్డో జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: ప్రపంచ ప్రఖ్యాత ఫుట్‌బాల్ క్రీడాకారుడు క్రిస్టియానో రోనాల్డో పుట్టిన రోజును పట్టణంలో ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఆత్మకూరు ఫుట్‌బాల్ క్లబ్ ఆధ్వర్యంలో రోనాల్డో జన్మదిన వేడుకలను నిర్వహించడం తమకు గర్వంగా ఉందని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఫుట్‌బాల్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఫుట్‌బాల్ క్లబ్ నిర్వాహకులు కనిష్క చక్రవర్తి, ఫుట్‌బాల్ క్లబ్ ప్రెసిడెంట్ హిమజా చక్రవర్తి, క్రీడాకారులు పాల్గొన్నారు.

చేనేత కులాల ఐక్యవేదికకు అల్లూరు నేతలు



నెల్లూరుకు తరలిన అల్లూరు చేనేత సంఘ నేతలు

అల్లూరు: నెల్లూరులోని ఓ కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన చేనేత కులాల ఐక్యవేదిక కార్యక్రమానికి అల్లూరు మండల పద్మశాలి సంఘం అధ్యక్షుడు మేడా మాధవ్ ఆధ్వర్యంలో చేనేత నాయకులు సంఘీభావంగా తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో చేనేత నాయకులు, చేనేత కులాలకు చెందిన వారు పాల్గొన్నారు.

ఊర్లోనే వ్యవ'సాయం'



చేజర్ల మండలం యనమదలలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్బీకే

వ్యవసాయం దండగ అన్న టీడీపీ అధినేత చంద్రబాబు పాలనలో రైతుల ఆత్మహత్యలకు కారణమైన దుస్థితి నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో వ్యవసాయం పండగ చేసుకుంటున్న పరిస్థితికి రైతులు చేరుకున్నారు. ఊర్లోనే వ్యవసాయానికి అవసరమైన సాయం రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోంది. రైతు సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. ప్రతి సచివాలయానికి అనుబంధంగా ఆర్బీకే ఏర్పాటుకు సంకల్పించి నిధులు మంజూరు చేసింది. ఆర్బీకేల్లో రైతులకు స్థానికంగా విత్తనాలతో పాటు ఎరువులు దొరుకుతున్నాయి. సబ్సిడీ, నాన్ సబ్సిడీతో విత్తనాలు, ఎంఆర్పీ ధరలకే ఎరువులు, పురుగు మందులు కూడా అందిస్తున్నారు. కౌలు రైతులకు పంట సాగు పత్రాలు కూడా ఇక్కడే జారీ చేస్తున్నారు. ఈ క్రాఫ్ నమోదుతో ఉత్పత్తులకు మద్దతు ధర కల్పిస్తున్నారు.

సబ్సిడీ, నాన్ సబ్సిడీతో విత్తనాలు సరఫరా

- ఎమ్మార్పీకే ఎరువులు, పురుగు మందులు
- సబ్సిడీతో వ్యవసాయ పరికరాలు
- పంట నమోదుతో ఉత్పత్తులకు మద్దతు ధర

చేజర్ల: రైతుల దశాబ్దాల కష్టాలకు కాలం తీరింది. పంట సాగు మొదలు, విక్రయం వరకు అవసరమైన సేవలకు పాలోమని పట్టణాలకు పరుగులు తీసే పరిస్థితులకు కాలం చెల్లించింది. ఉన్న ఊళ్లోనే రైతులకు అవసరమైన అన్ని సేవలు అందించే విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశారు. విత్తనాల నుంచి పంట ఉత్పత్తులు విక్రయం వరకు, వ్యవసాయ పరికరాల నుంచి యాజమాన్య పద్ధతుల వరకు అవసరమైన సలహాలు, సూచనలు అందిస్తున్నాయి.

ఆత్మకూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో మొత్తం 87 ఆర్బీకేలు ఉన్నాయి. వీటిలో 37 ఆర్బీకేలు పూర్తయి రైతులకు సేవలు అందిస్తుండగా, 44 ఆర్బీకే భవనాలు వివిధ దశల్లో ఉన్నాయి. అనంతసాగరం మండలంలో 3 ఆర్బీకేలకు సంబంధించి స్థల వివాదాలు ఉండడంతో ఇంకా నిర్మాణానికి నోచుకోలేదు. ఆర్బీకేలోనే తాము పండించిన పంటను అమ్ముకునే విధంగా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఆర్బీకేల్లో రైతులకు సంబంధించి లైబ్రరీ ఉంటుంది. ఇందులో పత్తి, వరి, మిరప, ఇతర పంటకు సంబంధించి శాస్త్రవేత్తలు, వ్యవసాయ నిపుణుల అందించే సాగు సూచనలు, సలహాల పుస్తకాలు ఉంటాయి. రైతులు ఖాళీ సమయాల్లో చదువుకుని వ్యవసాయంపై అవగాహన పెంచుకొంటారు. అక్కడే ఉండే టీవీలో పెన్‌డ్రైవ్ ద్వారా వ్యవసాయం చేసే విధానాలు, ఎరువులు వాడకం వివరాలను వ్యవసాయ శాఖ అధికారులు ప్రసారం చేస్తారు. వీటిని రైతులు చూసి వ్యవసాయ సమాచారం తెలుసుకొంటారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఆర్బీకేలు లేవు. రైతులు తాము పండించిన పంటను అమ్ముకునేందుకు చాలా అవస్థలు పడాల్సి వచ్చేది. కొంత కాలం క్రితం నియోజకవర్గ స్థాయిలో భూసార పరీక్షలు చేశారు. నేలలో పోషక విలువలు ఎంత శాతం ఉన్నాయో తెలుసుకునేందుకు ఉపయోగపడుతాయి. నేలలో ఆమ్లతత్వం, క్షారతత్వం ఉందో లేదో తెలుసుకునేందుకు ఉపయోగపడుతాయి. నేల సామర్థ్యంను బట్టి ఏ పంట ఎలాంటి ఎరువులు వాడాలో తెలిసిపోతుంది.

నియోజకవర్గంలో ఆర్బీకేలు

మండలం	ఆర్బీకేలు	పూర్తయినవి	నిర్మాణంలో ఉన్నవి
చేజర్ల	15	7	8
మర్రిపాడు	16	11	5
ఆత్మకూరు	14	3	8
అనంతసాగరం	16	6	7 (3 స్థల వివాదంతో పెండింగ్)
సంగం	13	3	10
ఏఎస్‌పేట	13	7	6



అనంతసాగరం మండలంలో భూసార పరీక్షలో మట్టి నమూనాను సేకరిస్తున్న దృశ్యం (ఫైల్)

మరికొన్ని సేవలు

- పంట నమోదుతో బ్యాంకులకు వెళ్లకుండా రుణాలు తీసుకోకుండా రైతులకు ఉచిత పంటల బీమా అమలు చేస్తారు. ప్రీమియం కూడా ప్రభుత్వమే చెల్లిస్తుండడంతో ఈ–క్రాప్ బుకింగ్ అయితే పంటల బీమాకు అర్హత వస్తుంది.
- అతివృష్టి, అనావృష్టి సంభవించినప్పుడు పంట నష్టంపై సర్వే చేసి రైతులకు నిర్దిష్ట గడువులోపే పరిహారం వచ్చేలా చర్యలు తీసుకుంటున్నారు.
- వ్యవసాయ అనుబంధశాఖలకు సంబంధించి డ్రిప్, స్ప్రింక్లర్లు, పవర్ స్ప్రేయర్లు, పశువులకు దాణా, గడ్డి విత్తనాలు తదితర ఏం కావాలన్నా ఆర్బీకేల ద్వారానే ఆర్డర్ పెట్టుకోవచ్చు. రైతులకు అవసరమైతే నాన్ సబ్సిడీ కింద అవసరమైన రుణాలు కూడా రైతుభరోసా కేంద్రాల ద్వారా అందించే వెసులుబాటు ఉంది.
- పంటలకు మద్దతు ధర లేనప్పుడు కనీస మద్దతు ధరతో రైతు పండించిన వివిధ ఉత్పత్తులను ఆర్బీకేల ద్వారా కొనుగోలు చేస్తారు.
- ఆర్బీకే ఉద్యోగులు సెలవుపై వెళ్లిన పక్షంలో రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆ రోజుల్లో వలంటీరు లేదా మరో సచివాలయ ఉద్యోగికి బాధ్యతలు అప్పగిస్తున్నారు.



చేజర్ల ఆర్‌బీకేలో వ్యవసాయ డిజిటల్ లైబ్రరీ

వ్యవసాయ అధికారుల సలహాలతో మంచి దిగుబడులు



వ్యవసాయంలో వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు చెప్పిన సూచనలు సలహాలు పాటించి నాణ్యమైన ఉత్పత్తులు సాధిస్తున్నాం. ఏ పంటకు ఎలాంటి ఎరువులు వాడాలో నిర్దిష్టంగా వినియోగిస్తున్నాం. వీరి సూచనలు, సలహాలతో పెట్టుబడులు తగ్గి, మంచి దిగుబడులు సాధిస్తున్నాం.

– వెంకటరెడ్డి, యనమదల, చేజర్ల మండలం

ఆర్బీకే సెంటర్లు మాకు వరం



రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి సచివాలయం పరిధిలో నూతనంగా నిర్మించిన ఆర్బీకేలు మాకు వరంగా మారాయి. విత్తనాలు కావాలన్నా.. పంట విక్రయించుకోవాలన్నా మండల కేంద్రానికి వెళ్లాల్సిన అవసరం లేకుండా పోయింది. పండించిన పంటకు ప్రభుత్వం గిట్టుబాటు ధరను కలిపించి మాకు సహాయపడుతోంది.

– పెంచలనాయుడు, యనమదల, చేజర్ల మండలం

రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం



పంట సాగులో రైతులకు అండగా నిలుస్తున్నాం. రైతులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ముందుస్తు జాగ్రత్తలు తీసుకొంటున్నాం. విత్తనాల నుంచి పంట ఉత్పత్తుల విక్రయం వరకు వారికి అన్ని విషయాల్లో అండగా నిలబడి సహకారం అందిస్తున్నాం. వరి కోతలు ప్రారంభానికి ముందే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాం.

– శశిధర్, ఏఓ, చేజర్ల మండలం

రాష్ట్రంలో పరిపాలన దేశానికే ఆదర్శం

- ఆర్డీఓ హోదాలో సంతృప్తికరంగా శిక్షణ
- సచివాలయ వ్యవస్థ ది బెస్ట్'
- ట్రెయినీ కలెక్టర్ సంజనా సింహా



మాట్లాడుతున్న ట్రెయినీ కలెక్టర్ సంజనా సింహా

ఆత్మకూరు: రాష్ట్రంలో ప్రభుత్వ పరిపాలన యావత్ దేశానికే ఆదర్శమని ట్రెయినీ కలెక్టర్ సంజనా సింహా అభిప్రాయపడ్డారు. దేశంలోనే అత్యున్నత చదువు అయిన ఐఏఎస్ నా చిరకాల వాంఛ. ఎందరో స్ఫూర్తితో దానిని పూర్తి చేసి శిక్షణ పొందుతున్నాను. ప్రస్తుతం ఆత్మకూరు డివిజన్‌లో 15 రోజులుగా తీసుకున్న శిక్షణ సంతృప్తికరంగా సాగిందని ట్రెయినీ కలెక్టర్ సంజనా సింహా అన్నారు. శిక్షణా కాలం పూర్తి కావడంతో ఆమె ఆదివారం ఆత్మకూరు నుంచి రిలీవ్ అయ్యారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2022 ఐఏఎస్ బ్యాచ్‌లో తాను ఆల్ ఇండియాలో 37వ ర్యాంకు సాధించానని తెలిపారు. తన తండ్రి ఉదయ సింహా హైదరాబాద్ హైకోర్టులో సీనియర్ అడ్వొకేట్‌గా ఉన్నారని, తల్లి బ్యాంకు ఉద్యోగినిగా ముందస్తు రిటైర్‌మెంట్ ఇచ్చారన్నారు. చిన్నప్పటి నుంచి కలెక్టర్ కావాలన్న తన లక్ష్యం కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో సాధించానన్నారు. తన భర్త ఐఏఎస్, గ్రూప్ 2, తదితర పరీక్షలకు శిక్షణ ఇచ్చే (ఎక్స్‌లెంట్ హర్షా అకాడమీ) కళాశాల నిర్వహిస్తున్నారన్నారు. తన శిక్షణలో సచివాలయ వ్యవస్థ గురించి క్షేత్రస్థాయిలో తెలుసుకునేందుకు అవకాశం కలిగిందన్నారు. సచివాలయాల ద్వారా రిజిస్ట్రేషన్లు నిర్వహించడం దేశంలోనే బెస్ట్ స్కీమ్ అని ఆమె అన్నారు. ఈ వ్యవస్థ ప్రపంచంలోనే గొప్ప విప్లవాత్మక మార్పు అని, ప్రఖ్యాత హార్వర్డ్ యూనివర్సిటీ గుర్తించి 'బెస్ట్ ప్రాక్టీస్ ఇన్ గుడ్ గవర్నెన్స్' అని కితాబిచ్చి పాఠ్యాంశాల్లో చేర్చనున్నట్లు తెలిసిందన్నారు. నెల్లూరు జిల్లా ప్రశాంతమైన జిల్లా అని ప్రజలు సైతం ముందస్తు ఆలోచనలతో ఉంటారని తాను గుర్తించానన్నారు. ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో శిక్షణ పూర్తయినట్లు, తొలుత సంగం మండలం పడమటిపాళెం వీఆర్‌ఓగా, అనంతరం మర్రిపాడు మండల తహసీల్దార్‌గా, అనంతరం ఆత్మకూరు ఆర్డీఓగా శిక్షణ పూర్తి చేసినట్లు ఆమె వివరించారు. పలు గ్రామాల్లో భూ సమస్యలను పరిష్కరించినట్లు తెలిపారు. సమస్యలు ఉంటాయని, వాటిని గాడిలో పెట్టేందుకే రీసర్వే జరుగుతున్నట్లు తెలిపారు. రీసర్వేలో చిన్న చిన్న సమస్యలను తన దృష్టికి తెచ్చారని, వాస్తవానికి ల్యాండ్ రికార్డుల్లో నమోదైన మేరకే నూతన పాసు పుస్తకాల్లోనూ ఉంటుందని భూములను పెంచడం, తగ్గించడం జరగదన్నారు. మర్రిపాడు మండలంలోని పొంగూరులో రైతుల మధ్య ఏళ్ల తరబడి పరిష్కారం కాని దారి సమస్యను పరిష్కరించడం తృప్తిగా ఉందన్నారు. చిలకపాడు, తదితర గ్రామాల్లో రేషన్ సరఫరా సక్రమంగా ఉండేలా, ఎండీయూ వాహనాల ఆపరేటర్లతో మాట్లాడి నేరుగా లబ్ధిదారుల ఇళ్లకే వెళ్లి ఇచ్చేలా చేసినట్లు చెప్పారు. స్వీప్ ప్రోగ్రామ్ విజయవంతంగా నిర్వహించినట్లు, ఓటు విలువ గురించి అవగాహన కల్పించి యువత తప్పని సరిగా ఓటరుగా నమోదు చేసుకోవడంతో పాటు కచ్చితంగా ఓటు వేసేలా వారికి తెలిపినట్లు ఆమె పేర్కొన్నారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో చివరి శిక్షణ పొందనున్నట్లు తెలిపారు.

ఒరిగిన ఇసుక టిప్పర్

చేజర్ల: ఇసుక అన్‌లోడ్ చేస్తుండగా టిప్పర్ ఒరిగిపోయిన ఘటన మండలంలోని ఆదూరుపల్లిలో జరిగింది. స్థానికుల సమాచారం మేరకు ఆదివారం మధ్యాహ్నం ఇసుక లోడుతో వచ్చిన ఓ టిప్పర్ ఆదూరుపల్లిలో అన్‌లోడ్ చేసే సమయంలో వెనుక టైర్ కాలువపై ఎక్కడంతో టిప్పర్ పూర్తిగా పక్కకు ఒరిగిపోయింది. ఆ సమయంలో అక్కడే ఓ వ్యక్తి ఉండడాన్ని స్థానికులు గమనించి వెంటనే అతన్ని పక్కకు లాగారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పడంతో స్థానికులంతా ఊపిరి పీల్చుకున్నారు. జేసీబీ సహాయంతో టిప్పర్‌ను పక్కకు తీశారు.

రేపు విద్యుత్ అదాలత్

కావలి: ఈ నెల 6న కావలి విద్యుత్ డీఈఈ కార్యాలయంలో ప్రత్యేక విద్యుత్ అదాలత్ జరుగుతుందని డీఈఈ ఎస్ బెనర్జీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను లిఖిత పూర్వకంగా తెలియజేసి పరిష్కరించుకోవచ్చన్నారు. కావలి డివిజన్ పరిధిలోని కావలి, కలిగిరి, అల్లూరు సబ్ డివిజన్స్‌కు సంబంధించిన వినియోగదారులకు తమ సమస్యలకు తగిన పరిష్కారాన్ని చూపే విధంగా కృషి చేస్తామన్నారు.

బైక్ అదుపు తప్పి వ్యక్తికి గాయాలు



ప్రమాదంలో గాయపడిన టీ పోలయ్య

మర్రిపాడు: బైక్ అదుపు తప్పి పడి ఓ వ్యక్తి గాయపడిన ఘటన మర్రిపాడు ఇసుక డంపింగ్ సమీపంలో నెల్లూరు– ముంబయి జాతీయ రహదారిపై ఆదివారం జరిగింది. మర్రిపాడు నుంచి బద్వేల్‌కు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న టీ పోలయ్య ముందు వెళ్తున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేయబోయి బైక్ అదుపు తప్పి కింద పడడంతో స్వల్ప గాయాలయ్యాయి. 108 సిబ్బంది వెంటనే స్పందించి ఆత్మకూరు ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు.

గండిపాళెం జలాశయ కాలువలకు మరమ్మతులు



యంత్ర సాయంతో కాలువలను శుభ్రం చేసిన దృశ్యం

ఉదయగిరి: మండలంలోని గండిపాళెం పొన్నేబోయిన చెంచురామయ్య జలాశయం పరిధిలోని పంట కాలువలకు ఇరిగేషన్ అధికారులు మరమ్మతు పనులు చేపట్టారు. డీఈ చంద్రమౌళి మాట్లాడుతూ ప్రాజెక్ట్ పరిధిలోని చివరి ఆయకట్టు వరకు సాగు నీరందించాలనే ఉద్దేశంతో ఉప కాలువలో పెరిగిన కంపచెట్లు, చెత్తాచెదారం, పేరుకు పోయిన మట్టిని తొలగిస్తున్నామన్నారు. మెట్టరైతులను దృష్టిలో ఉంచుకుని పంటలను కాపాడుకునేందుకు కుడి, ఎడమ ప్రధాన కాలువలకు నీటిని విడుదల చేస్తామన్నారు. రైతులు నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలన్నారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమీక్ష సమావేశంలో పాల్గొన్న నాయకులు, సభ్యులు

ఆత్మకూరురూరల్: నెల్లూరు జిల్లాలోని అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ప్లానింగ్ సెక్రటరీ షేక్ రియాజ్, వ్యవసాయ మార్కెట్ కమిటీల రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవసహాయం తెలిపారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఆదివారం ఉమ్మడి నెల్లూరు జిల్లా అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల ఆత్మీయ సమావేశం జరిగింది. ఉమ్మడి నెల్లూరు జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సుబ్బారావు, కార్యదర్శి శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు చెందాల్సిన అన్ని రకాల ప్రయోజనాలను సాధిస్తామని తెలిపారు. తమ యూనియన్‌కు సంబంధించిన పలు అంశాలపై చర్చించి తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో భాగంగా ఎంప్లాయిస్ ఫెడరేషన్ నెల్లూరు జిల్లా ప్లానింగ్ సెక్రటరీ రియాజ్, జిల్లా వ్యవసాయ మార్కెటీల ఉపాధ్యక్షుడు దేవసహాయంను అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఘనంగా సత్కరించారు.

టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనపరచిన విద్యార్థులు

వింజమూరు(ఉదయగిరి): వింజమూరులోని వైఆర్ జూనియర్ కళాశాలలో ఆదివారం అపస్ ఆధ్వర్యంలో ఉదయగిరి నియోజకవర్గ స్థాయిలో విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ జరిగింది. 51 పాఠశాలల నుంచి 412 మంది విద్యార్థులు హాజరయ్యారు. సిద్ధన కొండూరు జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థి వి.ధనుష్ (ప్రథమ), గుండెమడకల జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థి కేపీఎస్ తన్మయ (ద్వితీయ), వింజమూరు జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థి వై.నిఖిల్ (తృతీయ), జలదంకి జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థి టీవీఎల్ తేజస్వి (నాల్గో) బహుమతి దక్కించుకున్నారు. మంచి ప్రతిభ కనపరచిన మరికొందరు విద్యార్థులకు బహుమతులు డాక్టర్ మాశిలామణి బహుమతులు అందజేశారు. డాక్టర్ షఫిబాషా, ఎస్.అంకిరెడ్డి, కర్నాటి ప్రసాద్ రెడ్డి, బీవీ సుబ్బారెడ్డి, వై.మాల్యాద్రి, వీవీ చలమయ్య, పి.శివారెడ్డి, పి.కృష్ణారెడ్డి ఆర్థిక తోడ్పాటు నందించారు. కార్యక్రమంలో అపస్ వింజమూరు ఉపాధ్యాయులు పి.వెంగళరెడ్డి, జి.మాధవరెడ్డి, పి.మధుసూదన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అధికారులు జవాబుదారీగా పనిచేయాలి

- ఎంపీపీ వెంకటలక్ష్మమ్మ



మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటలక్ష్మమ్మ

వరికుంటపాడు: అన్ని శాఖల అధికారులు ప్రజలకు జవాబుదారీ తనంగా పనిచేయాలని ఎంపీపీ గవదగట్ల వెంకటలక్ష్మమ్మ అన్నారు. ఆదివారం స్థానిక స్త్రీశక్తి భవనంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలన్నారు. మండల సమావేశానికి అన్ని శాఖల అధికారులు హాజరుకాకపోవడంతో ఎంపీడీఓ చేవూరి శ్రీదేవి ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలో 18 శాఖల అధికారులు ఉండగా 8 మంది శాఖల అధికారులు కూడా హాజరుకాకపోవడం ఏమిటన్నారు. గైర్హాజరైన అధికారులపై జిల్లా ఉన్నతాధికారులను నివేదిస్తామన్నారు. మూడు నెలల కొకసారి జరిగే మండల సమావేశానికి హాజరుకాకపోతే ఎలా అని అన్నారు. గైర్హాజరైన అధికారులు ఎవరిని అడిగి అనుమతి తీసుకున్నారని ప్రశ్నించారు. బాధ్యతగా పనిచేసే ప్రజల్లో గుర్తింపు వస్తుందన్నారు. మండలంలోని జగనన్న లేఅవుట్లలో లబ్ధిదారుల అవసరాల దృష్ట్యా విద్యుత్ స్తంభాలు, లైన్లు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో సొసైటీ అధ్యక్షుడు గుంటుపల్లి రామాంజనేయులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

రైతు, ప్రజా సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఫరిద్దీన్ బాషా

ఉదయగిరి: మండలంలో రైతులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారులు పరిష్కరించాలని సీపీఎం కార్యదర్శి షేక్ ఫరిద్దీన్‌బాషా అన్నారు. ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దుత్తలూరు నుంచి సీతారామపురం వరకు నిర్మించే హైవే నిర్మాణంలో భూములు, ఇళ్లు, ఇంటి స్థలాలు కోల్పోయిన వారికి న్యాయం చేయాలన్నారు. స్థానిక రంగనాయకుల ఆలయం సమీపం నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలన్నారు. సీపీఎం కార్యాలయ సమీపంలో పేరుకు పోయిన చెత్త నిల్వలను తొలగించి చెత్త కుండీలు ఏర్పాటు చేయాలన్నారు. బీసీ, సీపీఎం కాలనీల సమీపంలో బస్ షెల్టర్లు నిర్మించాలన్నారు. ఆనకట్టపై పెరిగిన కంపచెట్లను తొలగించాలన్నారు. ఈ సమావేశంలో సీఐటీయూ నాయకులు నాగేశ్వరరావు, కమిటీ సభ్యులు పి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ ప్రక్రియ పరిశీలన



అల్లూరు: రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న డీటీ



రిజిస్ట్రేషన్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ స్వర్ణ సోమశిలలో

అల్లూరు: జగనన్న లేఅవుట్ ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను డిప్యూటీ తహసీల్దార్ నాగలక్ష్మి ఆదివారం పరిశీలించారు. స్థానిక అల్లూరు–1 సచివాలయ పరిధిలో జరుగుతున్న ఈ ప్రక్రియపై ఆరా తీశారు. పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు వీలైనంత త్వరగా రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు. ఏదైనా సమస్యలు ఎదురైతే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వరప్రసాద్, వీఆర్వో రంతుల్లా, డిజిటల్ అసిస్టెంట్ శాంతి తదితరులు పాల్గొన్నారు.

సోమశిల: అనంతసాగరం సచివాలయంలో జరుగుతున్న జగనన్న కాలనీల రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఇన్‌చార్జి తహసీల్దార్ స్వర్ణ ఆదివారం పరిశీలించారు. రిజిస్ట్రేషన్‌పై సందేహాలు, గ్రామ రెవెన్యూ అధికారులకు, పంచాయతీ కార్యదర్శులకు వివరించారు. సచివాలయాల్లో సాంకేతిక లోపాలు ఉంటే తమకు తెలియచేయాలన్నారు. రిజిస్ట్రేషన్ల ప్రక్రియను ఈ నెల 10వ తేదీ లోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు పరీక్ష సామగ్రి అందజేత



విద్యార్థినిలకు పరీక్ష సామగ్రిని అందజేస్తున్న దృశ్యం

కొండాపురం: స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి, ఇంటర్ చదువుతున్న విద్యార్థినిలకు ఆదివారం తాటికొండ రామమూర్తి జయంతి సందర్భంగా ఆయన కుమారుడు, లైఫ్‌లైన్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు తాటికొండ నవీన్ పరీక్ష సామగ్రిని వితరణగా అందించారు. విద్యార్థినిలకు అట్టలు, పెన్నులు, పెన్సిళ్లు, జామెంట్రీ బాక్సులు, హాల్ టికెట్ కవర్లతో పాటు అవసరమైన సామగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు నజిరుద్దీన్, గ్రామీణ వైద్యులు రూపినేని కృష్ణమోహన్, లైఫ్‌లైన్ ఫౌండేషన్ సభ్యులు ప్రవీణ్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.